క్లుప్తంగా

ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలి

గంగాధర: మహాజన్ సంపర్క్ అభియాన్ పీఎం మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించి ప్రచార సామాగ్రిని అందజేశారు. ఈ నెల 22 నుంచి 31 వరకు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పెరుక శ్రావణ్‌కుమార్, నరసింహాచారి, రవీందర్‌రెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రేండ్ల శ్రీనివాస్, శ్రీపతి రాజేంద్రప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ధర్నా


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చొప్పదండి: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల నుంచి పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర స్టేషనరీ పేరుతో దోచుకుంటున్నారని విమర్శించారు. ఆందోళనలో వేణు, రాజు, ఉపేందర్, శ్రీకాంత్, కుమార్, అభి, సాయి, అజయ్, వెంకటేశ్, సిద్దు, శివరామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శంకరపట్నం: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు వినతిపత్రం అందించారు. ఇళ్ల స్థలాలు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వడ్ల రాజు, లింగయ్య, రాజయ్య, కోటి, రమేశ్ యుగేందర్ పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత


టీచర్లకు సామగ్రి అందిస్తున్న మౌనిక

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీపాఠశాలకు పూర్వ విద్యార్థిని కొంకట మౌనిక, కొంకట శ్రీకాంత్ రూ.77,150 విలువ గల సామగ్రిని బహూకరించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఏడు సీలింగ్ ఫ్యాన్లు, సీపీయూ, రెండు బీరువాలు, ఐదు బ్లాక్‌బోర్డులు అందజేశారు. భవిష్యత్‌లో పాఠశాలకు వైట్‌వాష్, కలరింగ్ అయ్యే ఖర్చు కూడా తామే భరిస్తామని చెప్పారు. కరెంటు వైరింగ్, తాగునీటి సదుపాయం, ఇతర చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తామని చెప్పడంతో గ్రామస్తులు, సర్పంచ్ భూంరెడ్డి, హెచ్‌ఎం కె.రాజమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెండ్యాల శారద, యువజన సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు చట్ల సమ్మయ్య, గ్రామ మెడికల్ ఆఫీసర్ కార్తిక్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గుడుంబా బట్టీలు ధ్వంసం

సైదాపూర్: మండలంలోని రాయికల్ తండాలో హుజూరాబాద్ ఆబ్కారీ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి, గుడుంబా బట్టీలను ధ్వంసం చేశారు. బట్టీలు నిర్వహిస్తున్న వారిని తహసీల్దార్ బావ్‌సింగ్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్‌ను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తహసీల్దార్ బావ్‌సింగ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు @1,61,300 క్వింటాళ్లు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి(ఫైల్)

- ముగిసిన యాసంగి ధాన్యం సేకరణ
- పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు
- రైతుల ఖాతాల్లో జమవుతున్న డబ్బులు

జమ్మికుంట: యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. ప్రభుత్వం పీఏసీఎస్, డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 1,61,300 క్వింటాళ్ల సేకరించారు. అకాల వర్షాలతో కొనుగోళ్ల ప్రక్రియ కొంత ఆలస్యమైనప్పటికీ రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమవుతున్నాయని అధికారులు తెలుపుతున్నారు.

ప్రకృతి ప్రకోపం

పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపానికి వరిసాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరి పంటపై వానలు పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసింది. వర్షాల నష్టంపై అన్నదాతల ఆందోళన, ఆవేదనకు తలొగ్గి తడిసిన ధాన్యం కొంటామని ప్రకటించింది. మిల్లర్లు కొర్రీలు, కోతలతో ధాన్యం దిగుమతి చేసుకున్నారు. ఏది ఏమైనా ఎట్టకేలకు యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది.

కొనుగోళ్ల ప్రారంభం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 14న ధాన్యం కొనుగోళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. మే 25 వరకు పూర్తి స్థాయిలో కొనుగోలు చేశామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,060 చొప్పున ధాన్యం సేకరణ పూర్తి చేశామన్నారు.

సమన్వయంతో కొనుగోళ్లు పూర్తి



యాసింగిలో అకాల వర్షాలు కొంత ఇబ్బందులకు గురి చేసింది, కొనుగోళ్లలో కొంత జాప్యం జరిగింది. అధికారుల ఆదేశాలు, రైతుల సమస్యలను సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లు పూర్తి చేశాం. రైతులు, అధికారులు పూర్తి స్థాయిలో సహకరించారు.

– అదిత్యరావు, సీఈవో, ఇల్లందకుంట పీఏసీఎస్

మద్దతు ధరకు అమ్మాను



రెండున్నరెకరాల్లో వరి సాగు చేశాను. అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. 60 క్వింటాళ్ల ధాన్యం పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు విక్రయించగా రూ.లక్షకు పైగా నగదు ఖాతాలో జమ అయింది.

– ఎగ్గెటి సదానందం, రైతు, మడిపల్లి

పీఏసీఎస్- కేంద్రాలు- గ్రామాలు -క్వింటాళ్లు- రైతులు				
జమ్మికుంట	1	8	40,400	864
ఇల్లందకుంట	16	24	86,000	2600
తనుగుల	3	3	15,600	360
ధర్మారం	2	3	9,300	250
డీసీఎంఎస్ (నాగంపేట)	3	3	10,000	250

రైతుల నుంచి మొత్తం 1, 61,300 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

దీక్షకు విద్యార్థుల సంఘీభావం


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సంఘీభావం తెలిపారు. మండలం కోసం గ్రామస్తులు 52 రోజులుగా దీక్ష చేస్తున్నారు. కాగా రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అనంతర విద్యార్థులు దీక్షలో పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జమ్మికుంట: ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థలు అడ్మిషన్, ట్యూషన్, హాస్టల్ పేరుతో విద్యార్థుల నుంచి లక్షల్లో దోపిడీ చేస్తున్నాయని, జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం ఫీజు నియంత్రణ చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలని, మెటీరియల్ పేరిట పాఠశాలలో బుక్స్ అమ్మకాలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, ప్రదీప్, వంశీ, ఆశీష్, చందు తదిరతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న ఎంపీపీ పావని

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గారెంపల్లి లక్ష్మి భర్త లక్ష్మయ్య, కుమారుడు మహేందర్ అనారోగ్యకారణాలతో ఒకే నెలలో మృతి చెందారు. మంగళవారం లక్ష్మి కుటుంబాన్ని ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్ పరామర్శించి రూ. ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యా దినోత్సవం

జమ్మికుంట: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు జెండా ఆవిష్కరించారు. కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమానికి పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ హాజరయ్యారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఏటా రూ.10కోట్లు ఖర్చు చేస్తుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా గురుకులు, మైనార్టీ, మోడల్, కస్తూరిబా పాఠశాలు ఏర్పాటు చేసి కేజీ టు పీజీ విద్య అందిస్తుందని అన్నారు. అనంతరం పుస్తకాలు అందిచారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్నకోటి, కమిషనర్ శ్రీనివాస్, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్, తహసీల్దార్ రాజేశ్వరి, మున్సిపల్ ఈఈ సంపత్‌రావు, డీఈ ప్రభాకర్, ఏఈ చంద్రకళ, మేనేజర్ భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల ప్రైమరీ స్కూల్, శ్రీరాములపల్లి గ్రామాల్లో మనఊరు మనబడి పథకంలో పూర్తి చేసిన తరగతి గదులను కౌశిక్‌రెడ్డి, కనుమల్ల విజయ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు రాగిజావ, యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశారు. ఎంపీపీ పావని, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం విజేందర్‌రెడ్డి, రవీందర్, సర్పంచ్ మొగిలి పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని అన్ని పాఠశాలల్లో ర్యాలీలు, పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆకునూర్ కేజీబీవీ విద్యార్థులు గ్రామ చౌరస్తాలో సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కేజీబీవీ ఎస్‌వో రజిత, రజనీ, సునీత, పలు గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ పుస్తకాలు అందజేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఎంపీపీ రాణి పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామడుగు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన జరుగుతుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలో విద్యా దినోత్సవం పురస్కరించుకొని నూతన గ్రంథాలయం భవనం, వెలిచాలలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, ఎంపీపీ కవితలక్ష్మణ్, రామడుగు, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్లు వెంకటేశ్వర్‌రావు, మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, మండల ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, వైస్‌ఎంపీపీ రాజగోపాల్‌గౌడ్, ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, సర్పంచులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగాధర: మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజన సౌకర్యం, ఇంగ్లిష్ మీడియం సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చదువుల్లో రాణించాలని సూచించారు. సర్పంచ గంగాధర్, జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, మార్కెట్ చైర్మన్ ఎల్లయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్హోత్ర, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని పాఠశాలల్లో విద్యా దినోత్సవం నిర్వహించారు. రుక్మాపూర్‌లో ఎంపీపీ రవీందర్ పాల్గొన్నారు. చొప్పదండి బాలికల పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ వాజిద్ అలీని టీచర్లు సన్మానించారు. ప్రభుత్వ జూ.. కళాశాలలో విద్యార్థులను మెమోంటోలతో సత్కరించారు.

మానకొండూర్: ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని సుడా చైర్మన్ జీవీ రామకష్ణారావు అన్నారు. మానకొండూరు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. మనఊరు మనబడితో పాఠశాలలు అద్భుతంగా తయారవుతున్నాయని, సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్ నగర్‌లో కేజీబీవీ విద్యార్థినులు, ఊటూర్, పచ్చునూర్, వేగురుపల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. తెలుగుతల్లి వేషధారణ, నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. షల్ ఆఫీసర్ స్వప్న, సర్పంచ్‌లు సంగీత, సుదర్శన్, పాల్గొన్నారు.

గన్నేరువరం: ప్రభుత్వం సర్కార్ బడుల్లో సకల వసతులు కల్పిస్తుందని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి అన్నారు. విద్యా దినోత్సవం మండలంలో ఘనంగా నిర్వించారు. జంగపల్లిలో జెడ్పీటీసీ డిజిటల్ స్క్రీనింగ్ క్లాస్‌లు, డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు.విద్యార్థులకు నోట్‌బుక్స్, రాగి జావను అందజేశారు. గన్నేరువరంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను సర్పంచ్ లక్ష్మీ సన్మానించారు. తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో స్వాతి, సర్పంచులు లక్ష్మి, శారధ, నగేష్, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు అంజనేయులు, ఎంపీటీసీ రాజేశంగౌడ్, హెచ్‌ఎంలు రవీంద్రాచారి, సుమలత, ఉప సర్పంచులు వెంకటేశ్వర్లు, లత, డైరెక్టర్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఇల్లందకుంట: యూనిఫామ్స్ అందిస్తున్న కౌశిక్‌రెడ్డి

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్‌లో మనఊరు మనబడి కింద అన్ని హంగులతో ముస్తాబైన ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ రవీందర్‌తో కలిసి ప్రారంభించారు.ఎంపీపీ, జెడ్పీటీసీలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి, ఎంపీటీసీ జమున, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్, ఎంపీడీఓ నర్సయ్య, ఎంఈఓ కె శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎం శోభారాణి, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు. సుందరగిరిలో విద్యార్థులకు ఎంపీటీసీ తిరుపతి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

శంకరపట్నం: విద్యాదినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ తీశారు. హెచ్‌ఎంలు రోజారమణి, మమతగౌతమి, రాజిరెడ్డి, శ్రీనివాస్, సర్పంచ్‌లు సుజాత, వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ మండల అధకచక్షుడు మహిపాల్, కొంరయ్య, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ జ్యోతి ఉత్తమ ప్రిన్స్‌పాల్ అవార్డును కరీంనగర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదుగా అందుకున్నారు.

తిమ్మాపూర్: మండలంలోని పర్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థి కామల్ల మహేశ్‌ను ఘనంగా సత్కరించారు. 2013లో పదో తరగతి చదివిన మహేశ్ తర్వాత విద్యాభ్యాసం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదివాడు. ఇటీవల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు సాధించాడు. విద్యా దినోత్సవం సందర్భంగా సర్పంచ్ భారతి మహేశ్‌ను సన్మానించారు. విద్యార్థులు మహేశ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.


గన్నేరువరం: పారువెల్లలో విద్యా దినోత్సవంలో విద్యార్థుల నృత్యాలు


మానకొండూర్: పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సూడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు


రామడుగులో నూతన గ్రంథాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


చిగురుమామిడి: సుందరగిరి పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

‘కవ్వంపల్లికి సంబంధం లేదు’


మాట్లాడుతున్న నాయకులు

శంకరపట్నం: ధర్మారం గ్రామదేవతల ప్రతిష్ఠాపనకు హాజరైన ఎమ్మెల్యే రసమయిని నిలదీసిన సంఘటనకు డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణకు సంబంధం లేదని కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బొజ్జ చంద్రమౌళి అన్నారు. కేశవపట్నంలో మంగళవారం ధర్మారం గ్రామశాఖ అధ్యక్షుడు దేవునూరి కిష్టయ్యతో కలిసి మాట్లాడారు. కవ్వంపల్లి యువకులను ఉసిగొల్పాడని చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు నిరూపించాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేను అడ్డుకున్న యువకులను పోలీసులు తీసుకెళ్లేందుకు రావడంతో ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడంతో పోలీసులు విడిచిపెట్టారని కిష్టయ్య స్పష్టం చేశారు. గ్రామదేవతల ప్రతిష్ఠాపన కోసం వసూల్ చేసిన డబ్బుల వివరాలు గ్రామస్తులు అడుగుతారని ఒకరిద్దరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ముందస్తు అరెస్టు


ముందస్తు అరెస్టయిన వివిధ పార్టీల నాయకులు

రామడుగు: మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రవిశంకర్ వస్తున్నారని సమాచారంతో అసంపూర్తిగా ఉన్న రామడుగు బ్రిడ్జిపై అందోళనలు చేపడతారని కాంగ్రెస్, బీజేపీ నాయకులను పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులు బి.తిరుపతి, పి. శ్రీకాంత్‌గౌడ్, పి. శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, విజయ్, రామ్, లక్ష్మణ్, శ్రీధర్ కార్తీక్, రాజేష్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకొని వదలేశారు.

పెన్షన్ ఇవ్వాలి

శంకరపట్నం: ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారికి పెన్షన్ అందించాలని భారతీయ సురక్ష సమతి రాష్ట్ర కార్యదర్శి అంతం వీరారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమం చేసిన వారిని జైలుపాలు చేశారని, పెన్షన్, రవాణా సౌకర్యం, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా బుధవారం హుజూరాబాద్ సబ్ డివిజన్‌లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బస్తీ దవాఖానాలు ప్రారంభం

జమ్మికుంట: పేదల ఆరోగ్యంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, పట్టణాల్లో బస్తీ దవాఖానాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్తపల్లి, మారుతీనగర్‌లో నిర్మించిన బస్తీ దవాఖానాలను ప్రారంభించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు వైద్య సౌకర్యాలు కల్పించేందుకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించార పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్, రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, వైద్యులు, కౌన్సిలర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నియామకం


కొల్పుల రవి


మార్గం మల్లేశం

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గన్నేరువరం, ఖాసీంపేట గ్రామాలకు చెందిన కొలుపుల రవి, తిప్పర్తి పరిపూర్ణాచారి, బీసీ సెల్ మండల అధ్యక్షుడుగా మాదాపూర్ గ్రామానికి చెందిన మార్గం మల్లేశం నియామకమయ్యారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు నియమించామని మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

పద్మశాలీ సంఘం ఎన్నిక

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామ పద్మశాలీ సంఘం నూతన అధ్యక్షుడిగా గ్యాజంగి మల్లేశం, ఉపాధ్యక్షులుగా సిరిపురం రాజయ్య, పచ్చునూరి లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా అలిశెట్టి ఇస్తారయ్య, కార్యదర్శిగా బిల్ల రమేశ్, కోశాధికారిగా పచ్చునూరి ఆంజనేయులు, ముఖ్య సలహాదారుడిగా గ్యాజంగి రాములు ఎన్నికయ్యారు.